లాజికల్‌గా ఆలోచిస్తే పుస్తకం నేలమీద వున్నట్లేగా అన్నాను. దాంతో పోట్లాడుకున్నాం."

"అందులో పోట్లాడుకునేందుకేముంది?"

"నేను మా ఎదురింటాయన్ని యిష్టపడుతున్నాను. మా ఎదురింటాయన ఆయన కూతుర్ని యిష్టపడతాడు. అంటే నేను ఎదురింటాయన కూతుర్ని యిష్టపడ్డట్లే అనిఅర్థం చేసుకుంది మా ఆవిడ."

నేను వెంగళ్రావు యింటికి వెళ్ళినపుడు అతను, అతని భార్య ఓ చెక్క బీరువాని మెట్లమీద పట్టుకుని నిలబడ్డారు. "మనం దీన్ని "పైకి తీసుకెళ్ళలేం కూలీలని పిలుద్దాం" అని వెంగళ్రావు అంటే, పైకి తీసుకెళ్ళడమేమిటి? దీన్ని కిందకి తీసుకెళ్తున్నాం అనుకున్నా" అన్నది. అదీ మిసెస్ వెంగళ్రావు కేరెక్టర్.

వెంగళ్రావుని రైలు ఎక్కించడానికి తీసుకువెళ్ళాను. దారిలో ఏదో కనబడితే వంగి తీసుకుని చూసాడు. అది ఆడవాళ్ళ హేండ్‌బేగ్స్‌లో వుండే అద్దం.

అందులోకి చూసి మళ్ళీ పారేస్తూ చెప్పాడు.

"దరిద్రంగా వుంది ఎవరి కలర్ ఫోటోనోకాని. అందుకే పారేసి వుంటారు."

దటీజ్ మిస్టర్ వెంగళ్రావ్.

## లైఫ్ లాంగ్ కంపేనియన్

"నీ లైఫ్‌లాంగ్ కంపెనియన్ ఎవరు?" అని ఓ పెళ్ళయిన పెద్ద మనిషిని ఎవరో అడిగితే తన భార్య పేరు చెప్పలేదు. బదులుగా 'నా కళ్ళజోడు' అని సమాధానం యిచ్చాడు. నిజమే. భార్య జీవితాంతం వుంటుందో, వుండదో నమ్మకం లేదు. కాని ఓసారి చూపు మందగించి కళ్ళజోడు వస్తే జీవితాంతం దానిని ధరించి తీరాల్సిందే.

కళ్ళజోడు కొందరికే వస్తుంది. ముఖ్యంగా ఆడవాళ్ళకన్నా మగవాళ్ళకే కళ్ళజోడు అధికంగా వుండటం గమనించవచ్చు. అంటే కళ్ళజబ్బు మొగవాళ్ళకే వస్తుందని అర్థం చేసుకోనక్కర్లేదు. ఆడవాళ్ళకి వచ్చినా అందం చెడుతుందని వాటిని ధరించకపోవచ్చు. కారణం ఏమయినా ముక్కద్దాలు మగవాళ్ళకే అధికం.

కళ్ళజోడు ధరించిన వ్యక్తి అదిలేని వాడికన్నా మేధావి అనే అభిప్రాయం చాలామందిలో వుంది. మేధావులందరికి కళ్ళజోడు వుండటం ఓ కారణం అయితే, చదివితే కళ్ళజోడు వాడాల్సిన అవసరం వస్తుంది కాబట్టి, చదివి చదివి కళ్ళజోడు తెచ్చుకున్నవాడు మేధావి అనేది యింకోకారణం. నిజానికి చదువుకి, కళ్ళజోడుకి ఎలాంటి సంబంధంలేదు.

కళ్ళజోడు రెండురకాల కంటి జబ్బులవల్ల వస్తూంటుంది. ఒకటి దూరంవి కనపడకపోవటంవల్ల వచ్చేవి. దాన్ని షార్ట్ సైట్ అంటారు. రెండోది దగ్గరవి కనపడకపోవటంవల్ల. ఇది లాంగ్ సైట్ (దూరంవి కనపడకపోతే లాంగ్ సైట్, దగ్గరివి కనపడకపోతే షార్ట్ సైట్ అనుకోవడం తప్పు.) ఈ రెండుకాక కొందరు తలనొప్పివల్ల కళ్ళజోడు వాడాల్సి వుంటుంది. కొంత కాలానికి ఆ కళ్ళజోడు తీసేయచ్చు.

లాంగ్, షార్ట్ సైట్లవల్ల వాడే కళ్ళజోడు తీసేయడం కుదరదు. ఎందుకంటే ఎంతో అరుదుగా గాని ఆ రెండు జబ్బులు పోవు. షార్ట్ సైట్ ఏ వయసులో అయినా రావచ్చు. అయిదారేళ్ళనించి చచ్చేదాక ఎవరయినా దూరంవి కనపడటానికి కళ్ళజోడు పెట్టుకుని తీరాల్సిందే. కాని లాంగ్ సైట్ సాధారణంగా నలభై దాటాక వస్తూంటుంది. దీన్నే చత్వారం అని కూడా అంటారు నలభై దాటాక వచ్చేది కాబట్టే ఈ జబ్బుని 'చత్వారం' అని పిలుస్తూంటారు. కొందరికి చత్వారం తగ్గుతుంది. కొందరికి నిలిచిపోతుంది. అది వచ్చినవారు కళ్ళజోడుంటే కాని అచ్చు అక్షరం చదవలేరు.

నిజానికి దగ్గరి వస్తువులని చూడటం అంటే ఈ పుస్తకంలోని పోర్టీన్‌పాయింట్ అక్షరాలు చదవడం, వాచ్‌లో టైంచూసుకోవడం

లాంటివన్నీ ఈ శతాబ్దంలో వచ్చినవే. అంతకు పూర్వం మనిషి దగ్గరి వస్తువులని చూడాల్సిన అవసరం వుండేది కాదు. కేవలం దూరం వస్తువులనే చూస్తూండేవాడు. అందుకని మన కళ్ళు దగ్గరకన్నా దూరం వస్తువులని చూడటానికే అలవాటుపడ్డాయి. కళ్ళజోడుని కనిపెట్టిందీ, అభివృద్ధీ చేసింది కూడా యిటాలియన్సే. 1317 లో మరణించిన సాల్వినో-డి-అర్మాటో సమాధిమీద "కళ్ళజోడు ఆవిష్కర్త ఈయనే" అన్న వాక్యం చెక్కబడి వుంది. 1300కు మునుపు కళ్ళజోడు అన్న వస్తువే ఈ భూప్రపంచంలో లేదు.

కళ్ళజోడు వుండటంవల్ల కొన్ని సుఖాలున్నాయనే చెప్పాలి. ఎవరయినా మిమ్మల్ని యిబ్బందిపెట్టే ప్రశ్న వేసారనుకోండి. ఏం జవాబు చెప్పాలో తెలీక తడబడుతూ చూసే బదులు, నింపాదిగా కళ్ళజోడుని తీసి దాని రెండు అద్దాలని తుడుస్తూ తగిన అబద్ధం లేదా సమాధానం ఆలోచించచ్చు. చూసేవాళ్ళకి అది కావాలని సమాధానం డిలే చేస్తున్న భావన రాకపోగా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడన్న యింప్రెషన్ కలుగుతుంది.

అలాగే వుపన్యాసం చెప్పడానికి ఏ మహాసభకో వెళ్ళాడనుకోండి. ఎదురుగా వున్న జనాన్ని చూసి స్టేజ్ ఫియర్ పొందేకంటే హాయిగా కళ్ళజోడుతీసి టేబిల్‌మీద పెడితే అంతా అలుక్కుపోయినట్లుగానో, లేదా అసలేం కనిపించకపోవడమో జరుగుతుంది కాబట్టి ఎలాంటి ఫియర్ లేకుండా మాట్లాడేయచ్చు.

ఇష్టంలేని సినిమాకి ఫ్రెండ్స్‌తోనో, భార్యతోనో వెళ్ళాల్సి వచ్చినప్పుడు కళ్ళజోడు బాత్‌రూం వెంటిలేటర్లో దాచేసి అది కనపడలేదని, కళ్ళజోడు లేకుండా చూస్తే బాలకృష్ణ ఏఎన్నార్‌లా, చిరంజీవి గుమ్మడిలా కనిపిస్తారని చెప్పి తప్పించుకోవచ్చు.

కళ్ళజోడున్న వారివల్ల ఒక్కటే యిబ్బంది. దాన్ని ఎక్కడో పెడతారు. అవసరం వచ్చినప్పుడు కనపడక, ఎక్కడ పెట్టారో గుర్తురాక యింటిల్లిపాదినీ అది కనపడనందుకు తిడతారు. కళ్ళజోడుని మెడకి వేలాడతీసుకునే తాడు యిలాంటి వారికి చక్కటి మందు. ఇదీ

కళ్ళజోడులా విదేశీ యిన్‌వెన్షన్.

కళ్ళజోడు వున్న మొహం చూసి చూసి అలవాటయ్యాక అది లేకుండా ఆ మొహాన్ని చూస్తే బావుండదు. ఒకోసారి తక్కున గుర్తుపట్టలేం కూడా. ముక్కుకి అటు యిటు కళ్ళజోడు తగిలేచోట మచ్చలుపడి, కళ్ళు లోపలకి పోయినట్లుగా, గుంతలు పడ్డట్లుగా అనిపిస్తుంది. నిజానికి కొందరి మొహాలకి కళ్ళజోడు ఎంతో చక్కగా నప్పుతుంది. అది పెట్టుకుంటే అందంగా కనిపిస్తారు.

నాకు తెల్సిన ఓ అమ్మాయికి కళ్ళ జబ్బొచ్చింది. కళ్ళజోడు ఫ్రేమ్ తన అందాన్ని నాశనం చేస్తుందన్న భయంతో ఆమె 'ససేమిరా' అన్నది. ఎంతమంది బ్రతిమాలినా కళ్ళజోడుకి వప్పుకోలేదు. ఓ వారం తర్వాత ఆమె మొహంలోని కళ్ళజోడుని చూసి ఆశ్చర్యపోయి అడిగాను ఎప్పటినించి పెట్టుకుంటున్నావని. 'నిన్నటినించే' అన్నది. నీలో యింతమంచి మార్పు ఎలా వచ్చిందని అడిగితే 'నిన్నరాత్రి వంట చేస్తున్నప్పుడు నేలమీద వున్న పుచ్చకాయ గింజలని చూసి ఈగలనుకుని చేటతో వాటిని తోలాను. నిజానికది చేటకాదు. ఆనపకాయ."

ఓ అమెరికన్ మిత్రుడు ఫిలడెల్ఫియాలోని బార్‌లో చెప్పాడు.

"మా అమ్మమ్మ వయసు ఎనభైతొమ్మిది. ఆమె ఎన్నడూ గ్లాసులు వుపయోగించలేదు."

"ఆవిడ ఐసైట్ అంతగొప్పదా?" అంటే నవ్వి 'ఐసైట్ గురించి ఎవరు మాట్లాడుతున్నారు? గ్లాసులు వుపయోగించకుండా స్కాచ్‌ని స్టైయిల్‌గా బాటిల్‌లోంచి తాగుతుంది 'అన్నాడు. యింగ్లీష్‌లో గ్లాసెస్ అంటే కళ్ళజోడు అని ఓ అర్థం. 'తాగేగ్లాసులు' అని మరో అర్థం.

కళ్ళజబ్బువల్ల వాడే కళ్ళజోడుకి తమ్ముడు నల్లకళ్ళజోడు. సన్‌గ్లాసెస్‌గా లేదా కూలింగ్ గ్లాసెస్‌గా పిలవబడే యివి ఎండలో వెళ్ళేప్పుడు, ఫేషన్‌కోసం పెట్టుకుంటూంటారు. వీటిల్లో కింగ్ రేబాన్ గ్లాసెస్. వెస్ట్ జర్మనిలో తయారయే చాన్‌గ్లాసెస్ టాప్‌క్లాస్‌గా వుంటాయి.

నాకు పరిచయం వున్న ఓ అమ్మాయి నల్లకళ్ళజోడు పెట్టుకోవడం గొప్ప ఫేషన్ అనుకున్నది. ఓసారి కోర్ట్‌కి వెళ్తూ అవి

పెట్టుకుని వెళ్తుంటే ఆ అమ్మాయి లాయర్ చూసి కోప్పడి వాయించేసాడు కేసు గెలవాలనుకుంటున్నావా లేదా అని. నల్లకళ్ళజోళ్ళు కోర్టులో పెట్టుకోడానికి సాధారణంగా జడ్జ్‌లు అనుమతించరు. ఇప్పటికీ ఆ అమ్మాయి ఆనిడ అయాక కూడా నల్లకళ్ళజోడు వాడుతోంది. ఇప్పుడు ఫేషన్‌కన్నా కంటికింది నల్లగీతలు, వుబ్బినట్లున్న భాగం దాయడానికి వాటిని వుపయోగిస్తోంది.

పూర్వకాలం తెలుగు సినిమా హీరోకి కొంతకాలం నల్లకళ్ళజోడు ఉండేది. (భార్యాభర్తలు ఏఎన్నార్‌కి) తర్వాత విలన్స్ వాటిని వాడేవారు. సన్‌గ్లాసెస్‌లో పోలరైజింగ్ లెన్సెస్, మిర్రర్ డిజైన్డ్, ఏంటి-రిఫ్లెక్టివ్, డైలెక్‌టిక్, ఇంకా అనేక రకాలున్నాయి. ఇవి డ్రయివర్లకి అధికంగా వుపయోగిస్తూంటాయి.

'సోడాబుడ్డీ కళ్ళద్దం' అంటూంటారు కళ్ళజోడుకుండే అద్దం లావుగా వుండేవార్ని. అలాంటివారు గాజుఅద్దం బదులు ప్లాస్టిక్‌తో చేసిన అద్దం ఉపయోగిస్తే వాటిలావు తగ్గుతుంది అయితే ఖరీదు ఎక్కువ. అమెరికాలో, యూరప్‌లో చిన్న పిల్లల కంటి అద్దాలు ప్లాస్టిక్‌తో చేసినవే వాడాలి అనే చట్టాలున్నాయి, అటల్లో గాజువయితే పగిలి కళ్ళల్లో గుచ్చుకుంటాయని.

కంటి జబ్బున్న వారు ఎండలో వెళ్ళేప్పుడు యిదివరకు నల్లఅద్దాలని తమ కళ్ళజోడు ముందు భాగంలో తగిలించుకునేవారు. కాని పదిహేనేళ్ళనించి ఫోటోసన్, ఫోటో గ్రే ఎక్స్‌ట్రా, ఫోటోక్రైన్ మొదలయిన అద్దాలు వచ్చాయి. ఇవి ఎండలో తిరిగేవారికి పనికొస్తాయి. ఎండలోకి వెళ్ళగానే కూలింగ్ ఎఫెక్ట్ ఆటోమేటిక్‌గా వీటికి వస్తుంది.

కళ్ళజబ్బులుండి అసలు కళ్ళజోడే వద్దనుకునే వారికి కాంటాక్ట్‌లెన్స్, లేదా కంటిలోనే ఆపరేషన్ ద్వారా 'ఇంట్రాఆక్యులర్ లెన్స్'ని అమర్చుకుని కళ్ళజోడుని తీసేయవచ్చు.

కళ్ళజోడు ధరించాల్సి వచ్చిన ప్రతివ్యక్తి దేముడి దూరదృష్టికి మెచ్చుకోకతప్పదు.

మనకిఅసలు చెవులని సృష్టించి వుండకపోతే కళ్ళజోడు ఎలా పెట్టుకునే వాళ్ళం?